క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మల్కాపురం:శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.ఇందిరా కాలనీ –1,2, బర్మాకాలనీ, వీ.టీ.కాలేజీరోడ్డు ఏరియా,పవన్‌పుత్రకాలనీ ఏరియా,సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ఏరియా, జవహర్‌నగర్ ఏరియా వాసులు సహకరించాలని కోరారు.

రెల్లి కులస్తులకు వర్గీకరణలో న్యాయం చేయాలి


ఎమ్మెల్యే గణబాబుకు సమస్యలను వివరిస్తున్న కొట్నాన రవి

సింథియా: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే గణబాబుకు ఆంధ్రప్రదేశ్ రెల్లి కుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాన రవి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెల్లి కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు.అలాంటి అన్యాయం ఆంధ్రప్రదేశ్‌లో జరగకుండా చూడాలని, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అధిక సంఖ్యలో విస్తరించి ఉన్న రెల్లి కులస్తులపై మరింత లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. 1965లో లోకూర్ కమిటీ, 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్, 2008లో ఉషా మెహ్రా కమిషన్ రెల్లి కులస్తులు అత్యంత వెనుకబడి ఉన్నారని నివేదికలు, గణాంకాలతో సహా ప్రభుత్వానికి అందజేశాయని, వాటిని పరిశీలించాలే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో రెల్లి వాణి వినిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెల్లి కుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఐటీ ప్రిన్సిపల్ కమిషనర్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్(విశాఖ) బి.శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, శేషవస్త్రాలు, ప్రసాదం ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు.

విశేషంగా శ్రవణ నక్షత్ర హోమం


హోమం చేస్తున్న అర్చకులు

సింహాచలం: వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదికపై చక్రపెరుమాళ్లని వేంజేపచేశారు. హోమగుండం ఏర్పాటు చేసిన విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి జరిపారు. భక్తులకు యజ్ఞ ప్రసాదం అందించారు.

రుద్రాక్షల అలంకరణలో రాసపోలమాంబ



తగరపువలస: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారి ని బుధవారం రుద్రాక్షలతో అలంకరించారు. నగరంలోని పూర్ణామార్కెట్‌కు చెందిన మహిళలు తుపాకుల రాము, తుపాకుల అప్పలనారాయణమ్మ, తుపాకుల అచ్చియ్యమ్మ, కాగితాల అచ్చియ్యమ్మ, తుపాకుల పార్వతి తదితరులు ఈ అలంకరణకు సహకారం అందించారు.

నిరుద్యోగులకు మొండిచేయి.. నాయకులకు కాసుల పంట!

పారిశ్రామిక ప్రాంతంలో భారీ పరిశ్రమ అయిన హెచ్‌పీసీఎల్ నాయకులకు కాసుల పంటపండిస్తుండగా.. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కలగా మారింది. ఈ సంస్థ కోసం భూములు ఇచ్చిన పిల్లలకు కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి కాంట్రాక్ట్ పనులు లభిస్తుండడంతో యువత ఉపాధి లేక అల్లాడుతున్నారు. వీరికి అండగా నిలవాల్సిన కొన్ని కార్మిక సంఘాలు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి స్థానిక నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతున్నాయి.మరో వైపు యూనియన్లు మాత్రం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్థానిక యువత మండిపడుతోంది.

- హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానికేతరులకే ప్రాధాన్యం
- వారికి కల్పవృక్షంలా హెచ్‌పీసీఎల్
- స్థానిక యువతకు అన్యాయం
- పుట్టగొడుగుల్లా ట్రేడ్ యూనియన్లు


హెచ్‌పీసీఎల్ ముఖద్వారం


పనులకు హాజరైన స్థానికేతర కార్మికులు

మల్కాపురం: మల్కాపురం గ్రామానికి ఆనుకుని హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ ఉంది. సంస్థలో నాలుగేళ్ల నుంచి సుమారు 26 వేల కోట్ల రూపాయలతో విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఎల్ అండ్ టీ,రఫ్,పిట్రోఫ్యాక్, టెక్నిప్ ఇలా పలు ప్రైవేట్ సంస్థలు పనులు చేపడుతున్నాయి. అయితే విస్తరణ పనులకు ముందు హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఆ సమయంలో స్థానికులతో పాటు అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే పి.గణబాబూ కూడా స్థానిక నిరుద్యోగులకు 70 శాతం వరకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.దానికి సానుకూలంగా స్పందించారు. అయితే విస్తరణ పనులు మొదలై సంవత్సరాలు గడుస్తున్నా స్థానిక నిరుద్యోగులకు అరకొరగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. దీనిపై యాజమాన్యం కూడా స్పందించడం లేదు.

ఇతర రాష్ట్రాల కార్మికులదే పైచేయి

కాంట్రాక్టర్లు స్థానికులను కాకుండా బిహార్,ఉత్తర ప్రదేశ్, ఒడిశా ఇలా పలు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కార్మికులను తీసుకు వచ్చి పనులు చేయిస్తున్నారు. వారికి మల్కాపురం,శ్రీహరిపురం, ఆర్‌కేపురం,ప్రకాష్‌నగర్,ములగాడ,గాజువాక వంటి ప్రాంతాల్లో నివాసాలు ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇలా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 5 వేల మందికి పైగా ఇక్కడ పనులు చేస్తున్నారు.

స్థానికులపై నిర్లక్ష్యం ఎందుకో?

సాంకేతిక అనుభవంతో పాటు ఉన్నత చదువులు చదివిన స్థానిక యువతను కాదని ఇతర ప్రాంతాల వారికి కాంట్రాక్టర్లు అధిక అవకాశాలు కల్పిస్తున్నారు. స్థానికులైతే ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు,ఫైనల్ సెటిల్ మెంట్,ఈఎస్ఐ,పి.ఎఫ్‌లతో పాటు ఇతర అలవెన్స్‌లు ఇవ్వాల్సి ఉంటుందని స్థానికేతరుకుల చోటు కల్పిస్తున్నారు.

మౌనమేల..

దీనిపై ప్రశ్నించాల్సిన ట్రేడ్ యూనియన్ నాయకులు, పాలకులు నోరు మెదకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు మొదలుకాక ముందు కేవలం ఏడు ప్రధాన ట్రేడ్ యూనియన్లు ఇక్కడ కనిపించేవి. ఇప్పుడు దాదాపు 26కు పైగా ట్రేడ్ యూనియన్లు వెలిశాయి. ఇన్ని ట్రేడ్ యూనియన్లు ఉన్నా స్థానిక నిరుద్యోగులకు మాత్రం ఉపాధి అనుకున్న స్థాయిలో లభించడం లేదు. పేరు గాంచిన యూనియన్లతో పాటు కొత్తగా పుట్టుకు వచ్చిన యూనియన్ల నాయకులు సైతం కాంట్రాక్టర్లకు గులామ్ గిరి చేస్తుంటే తమ బతుకులు ఎలా మారుతాయని స్థానిక నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గేటు చుట్టూ ప్రదక్షిణ చేసినా..



హెచ్‌పీసీఎల్ సంస్థ కోసం మా భూములు ఇచ్చాం. అయినా విస్తరణ పనుల్లో చేరలేని పరిస్థితి. వెల్డర్‌గా నాకు 20 ఏళ్ల అనుభవం ఉంది. అయినా ఏ కాంట్రాక్టర్ గానీ,ట్రేడ్ యూనియన్ నాయకులు గానీ నాకు ఉపాధి కల్పించకపోవడం బాధాకరంగా ఉంది. గేటు చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. – బొట్ట సైదన్న, మల్కాపురం,గొల్లవీధి

కలాసీగా 15 ఏళ్ల అనుభవం ఉన్నా..



కలాసీగా,రిగ్గర్‌గా వివిధ సంస్థల్లో సుమారు 15 ఏళ్లకు పైగా పని చేసిన అనుభవం ఉంది. విస్తరణ పనుల్లో కలాసీ లేదా రిగ్గర్‌గా కాకపోయినా కనీసం హెల్పర్‌గా అయినా ఉపాధి అవకాశం కల్పించాలని ట్రేడ్ యూనియన్ నాయకులను కోరాను. కాంట్రాక్టర్ వద్ద వేడుకున్నాను.అయినా ఫలితం లేదు. –రాజారావు, మల్కాపురం,మార్కెట్ లైన్

పని కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నా..



కార్పెంటర్‌గా నాకు 35 ఏళ్ల అనుభవం ఉంది.హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో కార్పెంటర్ లేదా కలాసీగా నైనా ఉపాధి అవకాశం కల్పించాలని రెండేళ్ల నుంచి కాంట్రాక్టర్లు,ట్రేడ్ యూనియన్ నాయకుల చుట్టూ తిరుగుతున్నాను.ఫలితం లేకపోవడంతో భీమిలి,కూర్మన్నపాలెం,అనకాపల్లి వంటి ప్రాంతాల్లో పనులకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. – అప్పలరాజు, మల్కాపురం,పల్లివీధి

పోలింగ్ బూత్‌లో ఏర్పాట్ల పరిశీలన


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఏసీపీ పృథ్వీతేజ సందర్శించారు. సిబ్బంది.. వసతులు ఎలా ఉన్నాయో ఉన్నారా అన్న అంశాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటు వేసేందుకు వచ్చేవారిని పరిశీలించిన తర్వాతే లోపలకు అనుమతించాలని సూచించారు.

వైభవంగా కొండదేవతమ్మ పరస


పూజలు చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయి వెంకట దుర్గ అభయాంజనేయ కొండదేవతమ్మ పరసను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, బల్ల లక్ష్మణరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పరస మహోత్సవాన్ని తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మల్కాపురం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు జూరెడ్డి గంగరాజు, నీలం రాజు, జగ్గునాయుడు, బాలు, కనకరాజు పాల్గొన్నారు.

సర్వం శివమయం

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో కోలాహలంగా శైవక్షేత్రాలు
- మార్మోగిన శివనామస్మరణ


నందమూరినగర్ ఆలయంలో బారులు తీరిన భక్తులు


చింతామణి దుర్గాగణపతి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

గోపాలపట్నం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నియోజకవర్గంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గోపాలపట్నంలోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. ధ్వజ స్తంభాల వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. నరవ శివాలయం, నందమూరినగర్ ఉమారామలింగేశ్వరాలయం, పద్మనాభనగర్ శివాలయం, కొత్తపాలెం నాగేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లోని శివాలయాల వద్ద భక్తుల కోలాహలం నెలకొంది. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, సామూహిక అభిషేకాలు జరిపారు. పలు ఆలయాల వద్ద భక్తులు రాత్రి జాగార పూజలు నిర్వహించారు.

శంభో శంకర

విశాఖ విద్య: స్థానిక శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. 90వ వార్డు సీతారామరాజునగర్‌లోని పార్వతీ చంద్రమౌళీశ్వర ఆలయంలో జరిగిన శివరాత్రి మహోత్సవంలో కాలనీ, ఆలయ అధ్యక్షుడు నాగేంద్ర, ఉపాధ్యక్షుడు పి.రవిశంకర్, కమిటీ సభ్యులు భరత్‌కుమార్, కేఎస్ఎన్ రాజు, అజయ్ జగన్నాథం, కృష్ణమోహన్, హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు. 52వ వార్డు ఎన్ఏడీ సెంటర్‌లోని శివాలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ వరసిద్ది వినాయక చవితి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక శివలింగాన్ని ఏర్పాటు చేసి పంచామృతాభిషేకం జరిపించారు. సుగంధ సువర్ణ అభిషేకం 108 సార్లు నిర్వహించారు. 11 కేజీల బియ్యంతో అన్నాభిషేకం చేశారు. కాలనీకి చెందిన డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శిరీష దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. ఆలయ కమిటీ పెద్దలు డి.సూర్యనారాయణ, శంకర్‌రావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్ కాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొని శివపార్వతులకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సాలాపు రామారావు, బాలు అప్పారావు, శ్రీను శేఖర్ , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం పరిధిలో..

కంచరపాలెం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఐటీఐ కూడలి, ఊర్వశిజంక్షన్, కంచరపాలెం పరిధిలోని గవర కంచరపాలెం గణపతి గౌరీ పరమేశ్వర శ్రీవల్లి దేవసేన కుమారస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అల్లూరి శ్రీనివాస దీక్షితులు, కె.కాలనీ సాంబమూర్తినగర్‌లోని చంద్రమౌళి పార్వతీ ఆలయంలో అర్చకుడు పి.రాజేష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. రామ్మూర్తిపంతులుపేట, సాంబమూర్తినగర్, తుమ్మడపాలెం, ఐటీఐ కూడ లి, 104 ఏరియా బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, అర్చనలు, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. ఉపవాసం, జాగరణ కోసం అర్ధరాత్రి 12గంటలకు ప్రత్యేక అభిషేకాలు, 6 గంటల పాటు రుద్రహోమం నిర్వహించారు.

శివయ్యకు విశేష పూజలు

మల్కాపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక ఐటీసీ చింతామణి దుర్గాగణపతి ఆలయం వద్ద కొలువైన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి ప్రధాన అర్చకుడు ఉమాశంకర్ ప్రత్యేక అభిషేకాలు చేశారు. సుగంధ పుష్పాలు, పండ్లతో స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం మహా కుంబాభిషేకం చేపట్టారు. 59వ వార్డు గణపతినగర్ పసుపతినాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 60వ వార్డు శ్రీహరిపురంలో బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకురాలు సింధూ ఆధ్వర్యంలో శివ పూజలు జరిగాయి. కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ పాల్గొని శివలింగానికి పూజలు చేశారు. మల్కాపురం రెడ్డి వీధి, ప్రకాష్‌నగర్ శివరామకృష్ణ ఆలయం వద్ద పూజలు ఘనంగా జరిగాయి.


నరవ శివాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు


మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో స్వామిని దర్శించుకున్న భక్తులు


90వ వార్డు చంద్రమౌళేశ్వర ఆలయ పూజల్లో పాల్గొన్న భక్తులు


షిప్‌యార్డ్‌కాలనీలోని శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న భక్తులు


శ్రీహరిపురంలో శివరాత్రి పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ పి.వి.సురేష్

అలరించిన ఘంటసాల గానావధానం


ఘంటసాల పాటలపై అవధానం చేస్తున్న సయ్యద్ రహమతుల్లా

సీతంపేట: మహా శివరాత్రి సందర్భంగా ఘంటసాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల స్వరాలయ స్టూడియోలో బుధవారం ఘంటసాల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన ఆపాత మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నందగోపాల్ ఘంటసాల వేషంలో హావభావాలలతో, గానంతో అలరించారు. సోమయాజుల సత్యవేణి ఘంటసాల సావిత్రి వేషంతో మెప్పించారు. ఘంటసాల పాటలతో నందగోపాల్ ప్రదర్శించిన బుర్రకథ ఆకట్టుకుంది. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా చేసిన గానావధానం సభికులను ఆశ్చర్యపర్చింది. కార్యక్రమంలో గాయనీగాయకులు రామ్మూర్తి, కల్యాణి, అంబిక, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


పోలింగ్ కేంద్రంలో సిబ్బంది

గాజువాక: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గాజువాక సెగ్మెంట్‌కు సంబంధించి 809 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించడంతో ఈసారి ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారిన విషయం తెలిసిందే. గాజువాక సెగ్మెంట్‌లోని గాజువాక మండలంలో 708 మంది, పెదగంట్యాడ మండలంలో 101 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారికోసం గాజువాక జెడ్పీ హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రం, పెదగంట్యాడలోని నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. అవసరమైన విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కల్పించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు పోలీసు సిబ్బందితోపాటు పీవో, ఏపీవో, ఓపీఓలను అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

వైభవంగా నీలమ్మవేపచెట్టు అమ్మవారి జాతర

- దర్శనానికి బారులు తీరిన భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు


నీలమ్మవేపచెట్టు అమ్మవారి విగ్రహం


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: అస్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీ నీలమ్మవేపచెట్టు అమ్మవారి శివరాత్రి వార్షిక జాతర మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శంభర జోగారావుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, పులివేషాలు, ఇతర కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వచ్ఛంద సంస్థలు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశాయి.

కుటుంబ సభ్యుల చెంతకు పశ్చిమ బెంగాల్‌వాసి


పశ్చిమబెంగాల్ వ్యక్తిని కుటుంబానికి అప్పగిస్తున్న శ్రద్ధా సంస్థ సభ్యులు

సీతమ్మధార: ద్వారకానగర్ ఏయూటీడీ వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న పశ్చిమబెంగాల్ వాసి రెండేళ్ల అనంతరం కుటుంబ సభ్యుల చెంతకు చేరారు. వివరాలివి.. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని రాణిగంజ్ నివాసి అయిన మొహమ్మద్ హైదర్ షేక్ (40) పెయింటింగ్ పని చేసేవాడు. పెళ్లయ్యాక సొంత దుకాణం పెట్టుకున్న అతను, సరిగ్గా నడపలేక అప్పులపాలయ్యాడు. ఆ ఆందోళనతో వ్యాధిగ్రస్తుడైన హైదర్‌కు ట్రీట్‌మెంట్ ఇచ్చినా పూర్తిగా నయం కాలేదు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఇల్లు వదిలి వచ్చేసిన అతను విశాఖ చేరాడు. ఇక్కడ ఏయూటీడీకి పట్టుబడడంతో ద్వారకానగర్ టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. అక్కడ సంస్థ అందించిన సేవలకు బాగా కోలుకున్నాడు. ఈ క్రమంలో హైదర్‌ను శ్రద్ధా సిబ్బంది వైజాగ్ నుంచి తీసుకుని వెళ్లి బుధవారం అతని తల్లి, భార్య, అన్నదమ్ములకు క్షేమంగా అప్పగించారు. హైదర్‌ను అప్పగించడంతో సంతోషం వ్యక్తం చేసిన కుటుంబసభ్యులు, ఏయూటీడీ, శ్రద్ధా సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

శివతాండవం కావ్యంపై ప్రసంగం


ప్రసంగిస్తున్న రాంభట్ల నృసింహ శర్మ

సీతంపేట : మహాశివరాత్రి సందర్భంగా సహృదయ సాహితి ఆధ్వర్యంలో సరస్వతి పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన శివతాండవం కావ్యంపై తిరుమల బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ ప్రసంగ కార్యక్రమం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. నాట్య సాంప్రదాయంలోని పలు విశేషాలను ఆయన వివరిస్తూ శివతాండవ, శివలాస్య నాట్యాలను ప్రతిభావంతంగా ఎలా వర్ణించారో... ఎన్నో చరణాలను గానం చేస్తూ కవి ప్రయోగించిన పలు శబ్దాల భావార్థాలను సభకు వివరించారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ నారాయణాచార్యుల కవితా ప్రతిభను వివరించి శివతాండవం వంటి ప్రౌఢ రచనపై ప్రసంగించే సామర్థ్యం రాంభట్లకు ఉందని పేర్కొన్నారు. కె.జి.వేణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దర్భముళ్ల చంద్రశేఖర్, భాగవతుల సత్యనారాయణ, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.